# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 1, ఫిబ్రవరి 2026


### ఆపరేషన్ స్మైల్ ద్వారా

## 51 మంది బాల కార్మికులకు విముక్తి

★ జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**

బాలకార్మికుల నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ -12 దశలో జిల్లా వ్యాప్తంగా 51 మంది బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ శనివారం వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం 2 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, జనవరి 1 నుండి జనవరి 31 వరకు నెల రోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ - 12లో 46 మంది బాలురు, 5 గురు బాలికలు ఉన్నారని వివరించారు. ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో మొత్తం 23 మందిలో 22 మంది బాలురు ఒక బాలిక ఉన్నారని, కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌లో మొత్తం 28 మంది ఉండగా అందులో 24 మంది బాలురు, 4 గురు బాలికలు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. 14 సంవత్సరాల లోపు గల బాలలను ఎలాంటి పనుల్లోనూ పెట్టరాదని, 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాలకార్మికులుగా ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సిపిఐ కాంగ్రెస్‌తో కటీఫ్...

## బీఆర్ఎస్‌తో పొత్తు



- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై గులాబీ జెండా.. ఎర్ర జెండా.. : బాల్క సుమన్
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరిపై సంయుక్త పోరాటం: వాసిరెడ్డి సీతారామయ్య

**రామకృష్ణాపూర్, జనవరి 31, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో సార్వత్రిక ఎన్నికల మిత్ర పార్టీలు అయిన కాంగ్రెస్ పార్టీ, సీపిఐ పార్టీల మధ్య పొత్తు పొసగక పోవడంతో కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ పార్టీకీ కటీఫ్ ఇచ్చి, ప్రధాన ప్రతిపక్షం అయినా బీఆర్ఎస్ పార్టీతో దోస్తికీ సిద్ధం అయింది. చెన్నూరు ఎంఎల్ఏ, జిల్లా మంత్రి, వివేక్ వెంకటస్వామితో పలు మార్లు చర్చలు జరిపిన కాంగ్రెస్ పారీ సీపిఐ పార్టీల స్నేహం నిలబడకపోవడం గమనర్హం. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పై గులాబీ జెండాఎర్ర జెండా సంయుక్తంగా ఎగురుతుందని చెన్నూరు మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కలవేన శంకర్, సీపిఐ జిల్లా కార్య దర్శి రామడుగు లక్ష్ముణ్‌లతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ సీపిఐ పార్టీలు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని 22 వార్డులలో పరస్పర అంగీకారంతో కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. ఏ పార్టీకీ ఎన్ని సీట్లు అనేది ఫిబ్రవరి 3న స్పష్టత వస్తుందని అన్నారు. ఇరు పార్టీలు 22 వార్డులలో కలిసి ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ, సీపిఐ పార్టీల అభ్యర్థులను భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ,కమ్యూనిస్ట్ పార్టీల అభ్యర్థులను ఓటర్లు ఆశీర్వదిస్తే, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పై గులాబీ జెండాఎర్ర జెండాలను సంయుక్తంగా ఎగురావేస్తామని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాపై బీఆర్ఎస్ పార్టీ సీపిఐల సంయుక్తంగా పోరాటంవాసిరెడ్డి సీతారామయ్య రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై బావ సారూప్యత కల్గిన బి.ఆర్.ఎస్ పార్టీ, సీపిఐ పార్టీ సంయుక్తంగా పోరాటం చేస్తుందని ఏ.ఐ.టీ.యూ.సి రాష్ట్ర మిగతా 2లో..




### ప్రత్యేక సమగ్ర సవరణను

## పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త**

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, ఈఆర్ఓలు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..






## గంజాయి అక్రమ సాగు, రవాణాపై కఠిన చర్యలు

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**

గంజాయి అక్రమ సాగు, రవాణా పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డిఎస్పి వహీదుద్దీన్ లతో కలిసి మాదకద్రవ్యాల వినియోగం నివారణ, గంజాయి అక్రమ సాగు, రవాణా నియంత్రణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కు పాదం మోపాలని, గంజాయి సాగు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మిగతా 2లో..

### కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్లో

## భాజపా జెండా ఎగురవేస్తాం

★ ధీమా వ్యక్తం చేసిన ఎంపీ గోడం నగేష్

**కాగజ్‌నగర్, జనవరి 31, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ సమావేశానికి భాజపా కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్‌లో భాజపా జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఆ అభివృద్ధిని అందించే పార్టీ భాజపానేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు నడుస్తున్నాయన్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాల వల్ల పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని



తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన శాఖ గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి రూ.50 లక్షల అంచనాతో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ గ్రంథాలయం విద్యార్థులకు, మిగతా 2లో..

## సిపిఐ కాంగ్రెస్‌తో కటీఫ్... బీఆర్ఎస్‌తో పొత్తు

**(మొదటిపేజీ తరువాయి)**

అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ సీపిఐ పార్టీల మధ్య కుదిరిన స్నేహం చిరకాలంగా కొనసాగుతుందన్నారు. స్నేహపూర్వకంగా సీట్ల సద్దుబాటు చేసుకుని మున్సిపల్ ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేస్తామని అన్నారు. నూతన కలయికలో క్యాతన్‌పల్లి పురపాలికను అభివృద్ధి చేస్తామని అన్నారు. బీఆర్ఎస్, సీపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజా రమేష్, కంభగోని సుదర్శన్ గౌడ్, సీపిఐ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలని, ఓటరు జాబితాలోని ఓటర్ల మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి తరపున బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. 2 నియోజకవర్గాలలో 678 మంది బూత్ స్థాయి అధికారులు, 68 మంది సూపర్ వైజర్లు ప్రతి ఇంటికి వెళ్ళి పరిశీలిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకుంటామని, పెండింగ్లోని ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ సాగు, రవాణాపై కఠిన చర్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

తెలిపారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కళాజాత బృందాలచే గ్రామాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అటవీ శాఖ, పోలీస్ శాఖల అధికారులు నిఘా మరింత పటిష్టం చేయాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతం నుండి రవాణా అయ్యే అవకాశం ఉన్నందున విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని తెలిపారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీని పునరుద్ధరించాలి

**ఉట్నూర్, జనవరి 31, ప్రభాతవార్త :**



కేంద్ర పభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ పథకాన్నే పునరుద్ధరించాలని కాంగ్రెస్ ఎస్ సి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం కల్లూరిగూడ, గంగన్న పేట గ్రామాలలో పర్యటించి కూలీలకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, కూలీలు పాల్గొన్నారు.

## మూడు రోజులు పూజలు అందుకున్న జన దేవతల వన ప్రవేశం

**రామకృష్ణాపూర్, జనవరి 31, ప్రభాతవార్త**



సింగరేణి ఆధ్వర్యంలో ఆర్.కె 1ఏ జాతర లో మూడు రోజులు పూజలు అందుకున్న జన దేవతలు సమ్మక్క సారాలమ్మ లు శనివారం జనం నుండి వన ప్రవేశం చేశారు. కోయ పూజారుల నేతృత్వంలో మందమర్రి ఏరియా జి.ఎం రాధకృష్ణ, గద్దెలపై కోలువైన అమ్మవార్లకు చివరి పూజలు నిర్వహించగా కోయ పూజారులు సమ్మక్క సారాలమ లని వన ప్రవేశం గావించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డీ.జి.ఎం అశోక్, ఏరియా వర్క్ షాప్ డీ.జి.ఎం దూప్ సింగ్, సెక్యూరిటీ అధికారి రవి సీనియర్ పర్సనల్ అధికారులు సత్యనారాయణ, సందీప్, కమిటీ సభ్యులు ఏ.ఐ.టి.యూ.సి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, భీమానాతుల సుదర్శన్, సి.వి రమణ, ఎగ్గెటి రాజేశ్వర్ రావ్, సంపత్‌లు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్లో

# భాజపా జెండా ఎగురవేస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సమావేశంలో సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉందన్నారు. పట్టణంలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, రహదారుల అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో భాజపా అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులు వేగంగా చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం భారతీయ జనతా పార్టీ కరపత్రాలు, డోర్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థులను పరిచయం చేస్తూ ఎన్నికల్లో వారి విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై పార్టీ విధానాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. అనిత, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివకుమార్, ఎన్నికల కన్వీనర్ కొండ్ర మనోహర్ గౌడ్, కో కన్వీనర్ సమీర్ గుప్తా, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. భాజపా నాయకులు, శ్రేణులు సమిష్టిగా పనిచేసి కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని అన్నారు.

## కృషితో ఎదిగి.. ఇంజనీర్‌గా వీడ్కోలు

**- మోహినుద్దీన్‌కు ఘన సన్మానం**

**నస్పూర్, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ ఓసీపీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహినుద్దీన్ 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకుని శనివారం పదవీ విరమణ చేశారు. గని అధికారులు, సహచర ఉద్యోగులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఆయనను సన్మానించారు. నాలుగు దశాబ్దాల కాలంలో సింగరేణి సంస్థ అభివృద్ధికి మోహినుద్దీన్ అందించిన సేవలను ఈ సందర్భంగా సహచరులు గుర్తు చేసుకున్నారు. మోహినుద్దీన్ తన వృత్తి జీవితాన్ని ఫిట్టర్‌గా ప్రారంభించి, నిరంతర కృషి, అంకితభావంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయికి అంచలంచెలుగా ఎదిగారు. ఆయన ప్రస్థానం తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ నాయకులు పేర్కొన్నారు. సంస్థ పట్ల ఆయన ప్రదర్శించిన నిబద్ధతను సన్మాన సభలో కొనియాడారు. అనంతరం మోహినుద్దీన్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, నాయకులు పి. తిరుపతి రాజు, ఏ. రవీందర్ రెడ్డి, సీహెచ్. జీవన్ జోయల్, శీలం చిన్నయ్య, ఓరం జగన్ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**వేమనపల్లి, జనవరి 31, ప్రభాతవార్త**



చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సాయిబాబు అన్నారు. శనివారం కల్లంపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ అలం లక్ష్మణ్ అధ్యక్షతన పౌర హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను స్వేచ్ఛను ప్రసాదించిందని అన్నారు. కుల వివక్ష అంటరానితనాన్ని నిర్మూలించాలని అన్ని కులాలు వర్గాల వారు సోదర భావంతో మెలగాలని సూచించారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అధికారి రాదండి మూర్తి, హెచ్ డబ్ల్యూఓ బెల్లంపల్లి రాజు, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సరీ పనులు ప్రారంభం

**బెజ్జూర్, జనవరి 31, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలోని మొగవెల్లి గ్రామపంచాయతీలో ఎంజీఎన్ఆర్ఇజీఎస్ ద్వారా నిర్వహించు నర్సరీ పనులను శనివారం సర్పంచ్ కొడప శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు పనికివచ్చే మొక్కలను నరసరిలో పెట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామస్తులకు అవసరమయ్యే పూలు, పండ్ల చెట్లతో పాటు కలప ఇతర ముఖ్యమైన చెట్లను నర్సరీలో ఏర్పాటు చేయవలసిందిగా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం శ్రీ సమ్మక్క సారక్క దేవతలను దర్శించుకున్న రేణికుంట్ల ప్రవీణ్

**బెల్లంపల్లి, జనవరి 31, ప్రభాతవార్త**



మేడారం శ్రీ సమ్మక్క సారక్క తల్లులను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, రాంబాబు నాయక్. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం జాతర, అడవి తల్లి ఒడిలో, జంపన్న వాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్. అనంతరం వారు మాట్లాడుతూ అడవిబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపాలైన సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకోవడం గర్వకారణమని, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని తల్లులను కోరుకోవడం జరిగిందని, మేడారం జాతర గిరిజనుల సంస్కృృతి, సంప్రదాయాలు, ఆత్మాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందని రేణికుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు.

## సమ్మక్క-సారలమ్మ జాతరలో వికలాంగులకు ప్రత్యేక దర్శనం

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 31, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలం నందిగూడ పెద్దవాగు పంప్‌హౌజ్ సమీపంలో సమ్మక్క-సారలమ్మ జాతర నాలుగవ రోజు వైభవంగా కొనసాగింది. జాతర చివరి రోజు కావడంతో వనదేవతల దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. వనదేవతల దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతర నిర్వహణ కమిటీ పలు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వికలాంగ భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శన ద్వారాన్ని ఏర్పాటు చేయడంతో వారు సులభంగా దర్శనం చేసుకున్నారు. ఈ ఏర్పాట్లపై వికలాంగ భక్తులు కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## వనదేవతలను దర్శించుకున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 31, ప్రభాతవార్త:**



కాగజ్‌నగర్ మండలం నందిగూడ సమీపంలోని పెద్దవాగు పంప్‌హౌజ్ వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా చివరి రోజు శనివారం వన దేవతలను కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతలకు మొక్కులు చెల్లించి అమ్మవార్ల దీవెనలు తీసుకున్నారు. దేవతల దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ దేవతల కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొనగా, భక్తి వాతావరణం ఉట్టిపడింది. ఈ కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటి అధ్యక్షుడు తుమ్మ రమేష్, కమిటి సభ్యులు పోలోజు శ్రీనివాస్, అవధూత శ్రీనివాస్, మంద రాజయ్య, పిరిసింగుల శ్రీనివాస్ కొట శంకర్ దొంతమల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సమ్మక్క-సారక్క జాతర కాగజ్‌నగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతూ ఘనంగా కొనసాగింది.

# ఘనంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జన్నారం, జనవరి 31, ప్రభాతవార్త**

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో, వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య ఆదేశాల మేరకు శనివారం జన్నారం పట్టణ కేంద్రం, బస్టాండ్ వద్ద కమిటీ ఆరవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జెండాను ఆవిష్కరించి గల్ఫ్ కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గల్ఫ్ కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం కమిటీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. గల్ఫ్‌లో ఆపదలో ఉన్న కార్మికులను దేశ శాఖల నాయకులు తమ శక్తిని మించి సొంత డబ్బులు ఖర్చు చేసుకుంటూ ఎంబీసీతో పాటు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆదుకుంటున్నారని, ఇప్పటివరకు తెలంగాణ తో సహా ఇతర రాష్ట్రాల ఎన్నో కుటుంబాలకు మా కమిటీ సహాయం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితికి చెందిన అన్ని శాఖలు, అన్ని మండలాలు, అన్ని గ్రామాల కమిటీ సభ్యులు, నాయకులు, గల్ఫ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి గల్ఫ్ కార్మికుల ఐక్యతను చాటారని తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గల్ఫ్ కార్మికులు అయిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జన్నారం పట్టణంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు మాట్లాడుతూ, గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నారై అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేసి ఒక సంవత్సరం పూర్తయినప్పటికీ గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ బోర్డు ఏర్పాటు విషయంలో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందజేసి, సంపూర్ణ గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, ఇది తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలతో పాటు, 2024 సంవత్సరానికి ముందు గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు కూడా ఎక్స్‌గ్రేషియా వర్తింపజేసి న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల హక్కులు, భద్రత, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్, తిమ్మాపూర్, మహమ్మద్బాద్, రోటిగూడ, చింతగూడ, జన్నారం, పొనకల్, అక్కపెల్లి గూడెం, దేవునిగూడెం, కవ్వాల్, కామన్‌పెల్లి, కిష్టపూర్, ధర్మారం, బాదంపల్లి, చెర్లపల్లె, ఇందన్‌పెల్లి, మురిమడుగు, కమిటీల సభ్యులు, మండల నాయకులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.





**జన్నారం, జనవరి 31, ప్రభాతవార్త**

జన్నారం మండలం కామన్‌పెల్లి గ్రామం టిజిడబ్ల్యుడబ్ల్యుసి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆరవ జెండా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం మండలంలో మొదలుకొని చుట్టుపక్కల గ్రామాల్లో నివసిస్తున్న వివిధ దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్న గల్ఫ్ కార్మికుల ఐక్యత కోరకై ఏర్పాటు చేసిన టీజీ డబ్ల్యుడబ్ల్యుసి సంస్థ జెండా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కామన్‌పెల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జెండా ఆవిర్భవ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వ్యవస్థాపకులు జునుగరు నాగరాజు, అధ్యక్షులు జాడి కిరణ్ సంస్థలోని గల్ఫ్ కార్మిక సభ్యులతో మాట్లాడి ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు వంగాల శేఖర్, సంస్థ ప్రధాన కార్యదర్శి చాట్ల తిరుపతి మాట్లాడుతూ వివిధ దేశాలలో గల్ఫ్ కార్మికులు పడుతున్న కష్టాలు ఇబ్బందుల గురించి గుర్తు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం గల్ఫ్‌లో ఉన్న కార్మికులకు అండగా ఉండాలని, అలాగే (గల్ఫ్ రిటర్న్) స్థానికంగా ఉన్న గల్ఫ్ కార్మికులకు ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ నష్టపోయిన గల్ఫ్ కార్మిక కుటుంబానికి అందజేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి అని కోరుతూ జై గల్ఫ్, జైజై గల్ఫ్, గల్ఫ్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వంగాల శేఖర్, ప్రధాన కార్యదర్శి చాట్ల తిరుపతి,కార్యదర్శి జునుగురు వెంకటేశ్, ముఖ్య సలహాదారులు బోర్లకుంట వెంకటేష్, జునుగురు రామన్న, సభ్యులు లక్ష్మీపతి, శ్రీను, చిన్నన్న, సతన్న, రాయలింగు, సత్తయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సై అఖిల్‌ను కలిసిన నాయకులు

**నార్నూర్, జనవరి 31, ప్రభాతవార్త:**

నార్నూర్ మండలం నుంచి ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్ఫర్ అయిన ఎస్సై అఖిల్ని దళిత రత్న కోరెలె మహేందర్, రిపోర్టర్ తిరుమలేష్, వినోద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అఖిల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నార్నూర్ మండలంలో చేసిన సేవలను ప్రశంసించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసిన అఖిల్ సేవలు మరువలేనివని వారు తెలిపారు.




క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

## సాఫ్ట్ బాల్ పోటీలో మెరిసిన బాలుడికి చేయూత

**బజార్‌హత్నూర్, జనవరి 31, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని భూతాయి గ్రామంలోని జాట్ మహేష్ అనే బాలుడు సాఫ్ట్ బాల్ పోటీలో మెరిశారు. కాగా ఫిబ్రవరి 4 నుంచి 8 వరకు చత్తీస్‌గడ్‌లోని బిలాస్‌పూర్ లో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలో సెలక్ట్ అయినందుకు మహేష్‌కు పాఠశాల తరుపున 5000 రూపాయలు అందించారు. మహేష్ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జే భూమన్న, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా చేసుకోవాలి

**బజార్‌హత్నూర్, జనవరి 31, ప్రభాతవార్త:**

పట్టా పాసుబుక్ గల ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సౌథ్ అన్నారు. మండలంలోని పిప్రి గ్రామంలోని రైతు వేదికలో శనివారం రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశారు. ఆధార్ తరహాలోనే ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే 11 అంకెల రైతు ఐడి ఇవ్వబడుతందని అన్నారు. వ్యవసాయానికి సంబంధించిన సెంట్రల్ గవర్నమెంట్ నుంచి వచ్చే ప్రతీ స్కీంలు, పీఎం కిసాన్, క్రాప్ ఇన్సూరెన్సు తదితర వాటికి రిజిస్ట్రేషన్ ప్రామాణికంగా తీసుకోబడుతుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ నంబరును వెంట తీసుకురావాలని సూచించారు. రైతులు వారి వారి సమీప వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి క్రిష్ణపాల్, రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సౌథ్

# ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

**మంచిర్యాల, జనవరి 31, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు గద్దర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ గద్దర్‌కు సింగరేణి కార్మిక వర్గానికి విడదీయరాని బంధం ఉందని, సింగరేణి బచావో పేరుతో గోలేటి నుండి గోదావరిఖని, భూపాలపల్లి, ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం వరకు భాయి బాట కార్యక్రమాన్ని చేపట్టి సింగరేణి కార్మికులను చైతన్య పరిచి సింగరేణిలో కార్మికులు ఎదురుకునే సమస్యలను పరిష్కరించాలని, సింగరేణిలో నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు భాయిలు ప్రారంభించాలని, డిస్మిస్ చేసిన కార్మికులను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేసిన గద్దర్‌ది అని, పోరాటతత్వం, ధిక్కార వ్యక్తిత్వం, కదం తొక్కిన కలం, అలుపెరుగని గళం, అణగారిన వర్గాల ఆత్మగౌరవ చిహ్నం, అంబరాన్ని తాకిన తెలంగాణ అస్తిత్వ పతాకం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి తన ఆట పాటలతో ఊపిరిలుది, తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన ప్రజా గాయకుడు గద్దర్ మరణం యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు బూర్ల జ్ఞాని, కార్యదర్శి బి లక్ష్మి నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీడీవో



సీఎం కప్ క్రీడల్లో ఉత్కంఠంగా సాగిన వాలీబాల్ మ్యాచ్

# క్రీడలకు సర్కార్ ప్రాణం..

**- గ్రామీణ క్రీడాకారులకు సీఎం కప్ ప్రోత్సాహం**

**- జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎంపీడీవో**

**- మండలంలో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు**

**చింతలమానేపల్లి,జనవరి 31, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2026 క్రీడా పోటీలు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభమెయ్యాయి. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి జయరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ సర్పంచులతో కలిసి వారు క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించి పోటీలను ప్రారంభించారు.

## క్రీడాకారుల ప్రతిభకు వేదిక..

ఎంపీడీవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన వేదిక కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని కొనియాడారు. క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఎంఈవో జయరాజు మాట్లాడుతూ. క్రీడల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మండలం, జిల్లా స్థాయి దాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు.

## సందడిగా మైదానం..

మండలంలోని వివిధ గ్రామ పాఠశాలల నుండి గ్రామపంచాయతీల నుంచి క్రీడాకారులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పాఠశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేకల పోషక్క, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పీడీ హరీష్, పాఠశాల ఉపాధ్యాయులు సంపత్, రవికుమార్, సీనియర్ క్రీడాకారులు శంకర్, సతీష్‌తో పాటు మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశానికి మరింత సేవలు అందించాలి

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త**

దేశ పౌరులు తమవంతుగా దేశానికి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ లతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులు జిల్లాలో ఈ నెల 24 నుండి 31 వ తేదీ వరకు జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన చేశారని తెలిపారు. జిల్లాలోని వాంకిడి మండలం బంబార, రెబ్బెన మండలం గోలేటి, సిర్పూర్ టి మండల మండల కేంద్రం, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో సందర్శించి వివిధ విషయాలపై అధ్యయనం చేశారని తెలిపారు. పాఠశాలలలో తీసుకోవలసిన మౌలిక వసతులు, వ్యవసాయ రంగంలో చేపట్టవలసిన అంశాలపై, రవాణా, విద్య, వైద్య రంగాలలో చేపట్టిన అంశాలపై మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులకు వివరించారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన అంశాలు దేశ సేవలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులు జిల్లా కలెక్టర్ కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె. హరిత



# హంతకున్ని కఠినంగా శిక్షించాలి

**- ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత**

**- మహిళలకు రక్షణ కల్పించాలి**

**దహెగాం, జనవరి 31,ప్రభాతవార్త :**

దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామానికి చెందిన ఆత్మకూరు కళావతిని బుధవారం గ్రామానికి సమీపన పత్తి చేనులో హత్య చేసిన అదే గ్రామానికి చెందిన బడేరాం ని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టపగలే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మహిళలకు రక్షణ లేకుండా పోతుందని రక్షణ కల్పించాలని కోరారు.దహెగాం మండలంలో మూడు నెలల క్రితం శ్రావణి అనే మహిళ ను కుల దురంకర హత్య జరిగిందని. ఇలాంటి సంఘటనలు జరగకుండా మహిళలకు భద్రత కల్పించాలని ప్రభుత్వం ను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు భద్రత కల్పించడంలో విఫలం అయ్యాయని అన్నారు. మహిళల చట్టాల పై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలనీ అన్నారు. మరణించిన కళావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని 50 లక్షల రూపాయల ఎక్సగ్రేషియా చెల్లించాలని ఐదు ఎకరాల సాగు భూమితో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వాళ్ళ పిల్లల చదువులు ప్రభుత్వం భాద్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మహిళ పై ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీస్ యంత్రాంగం, ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వినోద, జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా నాయకురాలు షాహిన్, సరస్వతి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు టికానంద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ కోసం పోటీ పడిన అభ్యర్థులు

**- చెన్నూరు మున్సిపాల్టీలో 18 వార్డులకు 159 మంది నామినేషన్**

**- పోటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు**

**చెన్నూరు రూరల్, జనవరి 31, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో ప్రజాసేవ చేయడం కోసం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు ఉత్సాహంగా ముందుకు వచ్చి పోటాపోటీగా నామినేషన్లు దాఖలుచేసారు.చెన్నూరు మున్సిపాల్టీలో 18 వార్డులు ఉండగా, ఓటర్లు పురుషులు 9711, స్త్రీలు 10191, ఇతరులు 1 కలుపుకొని మొత్తం 19903 మంది ఓటర్లు ఉన్నారు. చివరి రోజు అన్ని పార్టీల నాయకులు తమ అభ్యర్థుల చేత నేమినేషండ్లు దాఖలు చేయించారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు పెద్దమొత్తంలో నామినేషన్లు దాఖలు చేయగా, ఆఫ్ నుండి 2 బీఎస్పీ1 సీపీఎం1 అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుండి 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల నుండి రెబల్ అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ప్రజాసేవ చేయడంకోసం ఇంతమంది అభ్యర్థులు పోటీ పడడం హర్షణీయం. చెన్నూరు మున్సిపాల్టీ పీఠం ఎవరు కైవసం చేసుకుంటారో చూడాల్సి ఉంది.

# కార్మిక భద్రత, రహదారి ప్రమాదాల నివారణపై చర్చ

**- జీఎం ఆధ్వర్యంలో ఏఐటీయూసీతో స్ట్రక్చర్ మీటింగ్**

**- సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని జీఎం రాధాకృష్ణ హామీ**

**మందమర్రి, జనవరి 31, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ యూనియన్ నాయకులతో స్ట్రక్చర్ మీటింగ్‌ను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మునుపటి స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించిన అంశాల పురోగతిపై సమీక్ష చేయడంతో పాటు, కార్మికుల భద్రతకు సంబంధించిన పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా మందమర్రి నుండి కాజీపేట జంక్షన్ వరకు ఇటీవల కొత్తగా నిర్మించిన రహదారులపై ప్రమాదాలు నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చ జరిగింది. అదేవిధంగా ఇతర కార్మిక సంక్షేమ, భద్రతా సమస్యలను కూడా యూనియన్ నాయకులు జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధులు విన్నవించిన సమస్యలను ఆయా విభాగాల అధికారులతో చర్చించి, వీలైనంత త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జిఎం జిఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, మందమర్రి ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, రామకృష్ణాపూర్ ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, డీజీఎం పర్సనల్ అశోక్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి జె., ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు సి.వి. రమణతో పాటు అన్ని విభాగాల హెచ్ఓడీలు, ఏఐటీయూసీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





## శబరి మాతాజీ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బలరాం జాదవ్

**నేరడిగొండ, జనవరి 31, ప్రభాతవార్త:**

బోథ్ మండలంలోని కుచులపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ సద్గురు శబరి మాతాజీ ఆలయ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ హాజరై పల్లకి సేవ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం వల్ల అమ్మ ఆశీర్వాదాలు గ్రామంపై నిండుగా ఉంటాయని తెలిపారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, హైందవ ధర్మాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తాంసీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న బలరాం జాదవ్

## పదవి విరమణ కార్యక్రమంలో బలరాం జాదవ్

**ఇచ్చోడ, జనవరి 31, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండలం కొకస్ మన్నూర్ వాస్తవ్యులు కదం సుదర్శన్ తాంసీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పదవి విరమణ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. బఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ కదం సుదర్శన్ విద్యారంగంలో చేసిన సేవలు ఆదర్శనీయమని అన్నారు. అధ్యాపకులకు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. పదవి విరమణ అనంతరం కూడా విద్యారంగానికి తమ అనుభవంతో సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, ఆత్మీయులు పాల్గొన్నారు.

## కెరియర్ లక్ష్యాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం

**పెంచికల్ పేట్, జనవరి 31, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్ పేట్ లో శనివారం కెరియర్ గైడెన్స్ పై ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రూప్ 1 డివిజనల్ అధికారి, ఏటిఓ పంకజ్ పాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు అహర్నిశలు కష్టపడాలని సూచించారు. తల్లితండ్రులు, గురువులను గౌరవిస్తూ, మత్తు, దుమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయికి చేరుకొని సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని విద్యార్థులను ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏటిఓ పంకజ్ పాల్

# జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



పాల్గొన్న భక్తులు



కళ్యానోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, కుటుంబసభ్యులు

**- జిల్లా కలెక్టర్ కె హరిత**

**రెబ్బెన/ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :**

బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్వామివారికి నిర్వహించిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, ఎస్పి నితికా పంత్, సింగరేణి సంస్థ గోలేటి జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి దంపతులు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, భక్తుల క్యూలైన్ వద్ద రద్దీ లేకుండా చూడాలని, ప్రముఖుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు దేవాదాయ శాఖ అధికారులు జాతర నిర్మాణ కమిటీ సభ్యులు కలెక్టర్, ఎస్పిలకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులు, ఎస్పి లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహసిల్దార్ సూర్యప్రకాష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ, దేవాదాయ శాఖ అధికారులు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు సనాతన సేవా సమితి సమ్మేళనం

**సిరికొండ, జనవరి 31, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఆదివారం సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో సమ్మేళన సభ నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. శివాలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 8:30 గంటలకు పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:00 గంటల నుంచి 2:00 గంటల వరకు సంత్ నారాయణ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్యపు శివ శంకర్ తెలిపారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ చేస్తారు. సనాతన ధర్మ బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## క్రీడలతోనే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జనవరి 31, ప్రభాతవార్త:**

క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. నేరడిగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జీపీ స్థాయి, మండల స్థాయి సీఎం కప్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి స్వాగతం స్వీకరించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వయంగా వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను క్రీడల్లో రాణించడం వల్లే గతంలో పీఈటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యానని గుర్తు చేశారు. గిరిజన విద్యార్థులు క్రీడారంగంలో ముందుండాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందన్నారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ రమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు శ్రీకాంత్, జ్యోతి, లక్ష్మి, సుధాకర్, అమృత్, మహేందర్ రెడ్డి, కృష్ణ, విజయ్, నాయకులు ప్రతాప్, ఫయాజ్, సరిచంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జనవరి 31 నుండి ఫిబ్రవరి 28 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి, ఎసీప్ ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అదేవిధంగా నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కోలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. చట్టపరమైన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు.

## సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

**ఆసిఫాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**

సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని పిఆర్టియుటిఎస్ కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. టెట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నాయకులతో కలిసి గోడప్రతులు ఆవిషరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23ను సవరించి 2010 కు ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికి టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఏఐఎఫ్టీఓ పిలుపుమేరకు పిఆర్టియుటిఎస్ కొమురం భీం అసిఫాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5చలో ఢిల్లీ ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియుటిఎస్ ఆసిఫాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్ సింగ్, కుమ్మరి రవి, రాష్ట్ర నాయకులు విజేష్, వెంకటేశ్వర్లు, దుర్గం అనిల్ కుమార్, జిల్లా నాయకులు శ్రవణ్ కుమార్, సోనేరావు, ప్రవీణ్ సోదర సంఘ నాయకులు రమేష్ ధనరాజ్, హేమంత్ సిందే, మండల బాధ్యులు, జిల్లా బాధ్యులు, రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న పిఆర్టియుటిఎస్ నాయకులు

# విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● కేజీబీవీలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు**

**నేరడిగొండ, జనవరి 31, ప్రభాతవార్త:**

విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. నేరడిగొండ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





హుండీను అందజేస్తున్న డాక్టర్ చిటికేశి రంజిత, సంతోష్ రాజ్ దంపతులు

## అడెల్లి పోచమ్మ ఆలయానికి హుండీ విరాళం

**సారంగాపూర్, జనవరి 31, ప్రభాతవార్త**

మండలంలోని సుప్రసిద్ధ శ్రీ మహాఅడెల్లి పోచమ్మ దేవాలయానికి శనివారం నిర్మల్ పట్టణానికి చెందిన డాక్టర్ చిటికేశి రంజిత, సంతోష్ రాజ్ దంపతులు దేవాలయానికి రెండు నూతన పర్మినెంట్ హుండీలు రూ. 3,75,000 విలువ గల ప్రాకార మండపంలో ఏర్పాటు చేసి ఆలయ అదికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమములో ఆలయం ఛైర్మెన్ ఎస్ భోజగౌడ్, ఆలయ కార్యనిర్వాధికారి కే భూమయ్య, సీనియర్ అసిస్టెంట్ ఏ రాజేష్, కాంట్రాక్టర్ జగన్మోహన్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సియం కప్ పోటీలు

**బజార్‌హత్నూర్, జనవరి 31, ప్రభాతవార్త:**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటే శరీరానికి, మనసుకు మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీడీవో కే శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జాతర్ల గ్రామంలో శనివారం సియం కప్ సెకండ్ ఎడిషన్ కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ యం నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రతి గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొనాలని అన్నారు. గెలుపోటములు సహజమని, గెలిస్తే ముందుకు సాగుతారని, ఓడితే నిరుత్సాహపడకుండా మరోమారు గెలవడానికి అవకాశం దక్కుతుందన్నారు. క్రీడల ద్వారా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం ఎస్సై సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి క్రీడా వేదికలు వారి నైపుణ్యాలను వెలికితీయడానికి దోహదపడతాయని అన్నారు. క్రీడలు కేవలం వినోదానికే కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదిగేలా క్రీడాకారులు పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యాంసుందర్, ఎంపిఓ మహేందర్ రెడ్డి, మండల వైద్యాధికారి డా. భీమ్ రావ్, ఎంఈఓ బి రాం కిషన్, జాతర్ల క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం కిషన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మేస్రం మాధవ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ ఎస్‌కె అఖిల్, మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం నర్సయ్య, అధికారులు

## మహాశివరాత్రి మహోత్సవానికి డా.కొత్తపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానం

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 31, ప్రభాతవార్త:**

మహారాష్ట్ర లోని చెప్రాల శ్రీ కార్తిక్ మహారాజ్ స్వామి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవారిని బిజెపి సీనియర్ నాయకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం అధ్యక్షులు సంజయ్ పందిలవారే, ఉపాధ్యక్షులు సుధాకర్ బత్తుల, కోశాధికారి దుర్గాఅంజయ్య, మనోహర్ పటేల్ తదితరులు ఆహ్వానాన్ని అందజేశారు. మహాశివరాత్రి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.




డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానాన్ని అందజేస్తున్న కమిటి సభ్యులు

## అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి

**- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్**

**హాజీపూర్, జనవరి 31, ప్రభాతవార్త**

ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, గ్రామపంచాయతీ సర్పంచ్ మిట్టపల్లి రామ్ రెడ్డిలతో కలిసి ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో గౌరవ స్థానం లభిస్తుందని అన్నారు. ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరు రావడమే కాకుండా చదువు నేర్చుకుని 100 రోజుల్లో అక్షరాస్యులుగా తయారు కావాలని, అక్షర వికాసం పుస్తకంలోని 16 చాప్టర్ లను 100 రోజులలో పూర్తి చేయాలని తెలిపారు. వయోజన విద్య నేర్చుకుంటున్న మహిళా సంఘ సభ్యులు అక్షరాస్యతతో కీలక జీవన నైపుణ్యాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర కేంద్రం వాలంటీర్లు శిరీష, దాసరి శ్యామల, జె డి ఎం రామచందర్, ఎ పి ఎం వెంకటేష్, సిసిలు మోహన్, కృపవర్ణ, రాజమణి, విఓఎలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.





## బాల్క సుమన్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**రామకృష్ణాపూర్, జనవరి 31, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతం అవుతుందని మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్ అన్నారు. శనివారం 15వ వార్డుకు చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సిరిమల్లె సుధాకర్, చంద్రకల బిఆర్ఎస్ పార్టీలో చేరగా సుమన్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీకి కొండంత అండ అన్నారు. కొత్తగా పార్టీలోకి చేరిన నాయకులతో క్యాతన్ ల్లిలో పార్టీ మరింత పుంజుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ రమేష్, కంభగోని సుదర్శన్ గౌడ్, ఆర్నె సతీష్‌లు పాల్గొన్నారు.




నూతన ఎస్ఐ విజయ్‌కి శాలువాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నూతన ఎస్ఐ కి శాలువాలతో సన్మానం

**ఉట్నూర్, జనవరి 31, ప్రభాతవార్త :**

ఉట్నూర్‌కి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన్న గుంపుల విజయ్‌ని శనివారం శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి మహేందర్. వారు మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తొడసం రాదా బాయి ఉన్నారు.

## మున్సిపాలిటీలో బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

**- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**

**లక్షెట్టిపేట, జనవరి 31, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలో అత్యధిక మెజార్టీ స్థానాలు గెలిచి మున్సిపల్ బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. ఆదివారం సాయంత్రం మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీలోని ప్రతి వార్డు సమస్యను పరిష్కరించామని తెలుపుతున్నాము. ఎవరికి ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా పారదర్శకమైన పాలన అందించామని అన్నారు. అధికారంలోకి వచ్చి 25 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు కళ్యాణ లక్ష్మి, తులం బంగారం, రైతుబంధు, రైతు బీమా, పెన్షన్ పథకాలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేశామని అది నేడు కరువైందని ప్రజలందరూ గమనిస్తున్నారని త్వరలోనే వారికి బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ 9 మంది అభ్యర్థులను ప్రకటించారు. మిగతావి త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ప్రజలందరూ కలిసి బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజా ప్రతినిధులు, కౌన్సిలర్ వార్డ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

